క్లుప్తంగా

హామీల అమలేది ?

హుజూరాబాద్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ సాధ్యంకానీ హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. ఆడపిల్లలకు పెళ్లి సమయంలో కల్యాణలక్ష్మి పథకం మాజీ సీఎం కేసీఆర్ రూ. లక్ష ఇచ్చేవారని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో తులం బంగారం ఇస్తామన్నదని, అధికారంలోకి వచ్చి 17 నెలల అయినప్పటికీ ఆడపిల్లలకు వీసమెత్తు బంగారం ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ నిలబెట్టుకోవడంలేదన్నారు. నియోజకవర్గంలోని వీణవంక మండలానికి చెందిన పలువురికి కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇవ్వాలని కోరారు.

సీఎం వ్యాఖ్యలు హాస్యాస్పదం

హుజూరాబాద్: రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యాలు రాజ్యాంగ విరుద్ధమేనని జనతాదళ్ (సెక్యులర్) పార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు అన్నారు. సోమవారం పట్టణంలో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై గోప్యత పాటించకుండా మీడియా ముందు బహిరంగంగా రాష్ట్రం దివాలా తీసిందనడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో మాట్లాడటం ఓటు వేసిన ప్రజలను అవమానించడమేనని ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చకుండా ఇలాంటి మాటలను మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని సమర్థవంతమైన నాయకుడికి ముఖ్యమంత్రి పదవి అప్పగించి రాష్ట్ర ఆర్థిక అభివృద్ధిని మెరుగుపరిచేందుకు కృషి చేయాలని కోరారు.

ఫీజుల దోపిడీని అరికట్టడంలో ఎంఈవో విఫలం



మాట్లాడుతున్న రోహిత్, నాయకులు

హుజూరాబాద్: ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల దోపిడీని అరికట్టడంలో ఎంఈవో విఫలమయ్యారని, వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి రాంపెల్లి రోహిత్ అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలు విద్యా వ్యాపారం చేస్తున్నాయని, అక్షరాలతో లక్షలు సొమ్ముచేసుకుంటున్నాయని, ఇష్టానుసారం ప్రకటనలు, ప్రచారం చేస్తున్నా విద్యాశాఖ పట్టించుకోవడం లేదన్నారు. అడ్మిషన్, స్కూల్, యూనిఫామ్, పుస్తకాలు తదితర పేర్లతో లక్షలు వసూలు చేస్తున్నాయని ఇప్పటికైనా విద్యా శాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు రాధాకృష్ణ, శివ, మహేష్, అరుణ్,కౌశిక్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి

సైదాపూర్: మండలంలోని వెన్నంపల్లి ఉన్నత పాఠశాలలో అమెజాన్, అమెరికన్ ఇండియా ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను సోమవారం ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. వేసవి విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ అందించడం అభినందనీయమని, శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగంచేసుకోవాలన్నారు. కంప్యూటర్‌లో కోడింగ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, కెరియర్ గైడెన్స్ తదితర అంశాలను విద్యార్థులు తరగతులకు హాజరై నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రభాకర్‌రెడ్డి, టీచర్లు శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఏఐఎఫ్ కోఆర్డినేటర్ నాగరాజు, సీఆర్పీ రమేష్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్టులు

చొప్పదండి: పట్టణంలోని నాలుగో వార్డులో క్రికెట్ క్రీడాకారులకు మాజీ కౌన్సిలర్ చేపూరి హేమ ఆధ్వర్యంలో సోమవారం టీషర్టులు పంపిణీ చేశారు. 12వ వార్డులోని క్రీడాకారులకు కాంగ్రెస్ పట్టణ శాఖ మాజీ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్ ఆధ్వర్యంలో టీషర్టులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్, గౌడ సంఘం అధ్యక్షుడు పెరుమాండ్ల గంగయ్యగౌడ్, ఆత్మ చైర్మన్ గుర్రం రాజేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలను ఢీ కొట్టిన డీసీఎం వ్యాన్

వీణవంక: మండలంలోని మొలంగూర్‌కు వెళ్లే దారిలో డీసీఎం వ్యాన్ గొర్రెలను ఢీకొట్టడంతో నాలుగు జీవాలు మృతిచెందాయని బాధితుడు వాపోయాడు. మామిడాలపల్లి గ్రామం నుంచి ధాన్యం లోడ్‌తో కరీంనగర్ వెళ్తున్న వ్యాన్ వీణవంక గ్రామానికి చెందిన చిన్నాల సమ్మయ్యకు చెందిన నాలుగు గొర్రెలను ఢీ కొట్టింది. గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందడటంతో సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లిందని బోరున విలపించాడు.

ముందుకుసాగని పనులు

- గ్రామాల్లో సవాల్‌గా మారిన చెత్త సేకరణ
- తడి, పొడిచెత్త వేరుచేయడం, ఎరువుల తయారీ అంతంతే
- పేరుకుపోతున్న ట్రాక్టర్ బిల్లులు



ధర్మారంలోని కంపోస్టు షెడ్డు

శంకరపట్నం: గ్రామాల్లో చెత్త సేకరణ సవాల్‌గా మారింది. మండలంలో 24 గ్రామ పంచాయతీలుండగా కొత్తగా గుడాటిపల్లి, నల్లవెంకయ్యపల్లి, అంబేద్కర్‌నగర్ జీపీలుగా ఏర్పడడంతో మొత్తం 27 గ్రామ పంచాయతీలయ్యాయి. గ్రామ పంచాయతీల పాలకవర్గ పదవీకాలం ముగిసి ఏడాది గడిచినప్పటికీ ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. వీధిలైట్ల నుంచి మంచినీటి పైప్‌లైన్ లీకేజీలు, మోటార్ల మరమ్మత్, ట్రాక్టర్ డీజిల్, రిపేర్ తదితర పనులకు పంచాయతీ కార్యదర్శులు జేబుల నుంచి డబ్బులు ఇవ్వాల్సి వస్తోంది. లేదంటే పనులు సాగడం లేదు. కేశవపట్నం మెయిన్‌రోడ్డుతో పాటు గ్రామంలో నిత్యం ట్రాక్టర్‌లో చెత్త సేకరణ చేపడుతున్నారు. చెత్త సేకరించకుంటే ప్రధాన రోడ్డు పక్కన పేరుకుపోతుంది. కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి పక్కనే కేశవపట్నం ఉండటం, రోడ్డు పక్కనే చెత్తపేరుకుపోయిందంటే అధికారుల మందలింపు ఉంటుంది. దీంతో నిత్యం ట్రాక్టర్‌లో జీపీ సిబ్బంది చెత్తను సేకరిస్తున్నారు. మండలంలోని చిన్న జీపీలకు నిధుల కొరత, ట్రాక్టర్ ఈఎంఐ, రిపేర్, డీజిల్ ఖర్చులు చెల్లించలేక సక్రమంగా చెత్త సేకరణ చేపడతలేరని విమర్శలు వెలువడుతున్నాయి.

తడి, పొడి ఎరువుల తయారీ

గ్రామాల్లో సేకరించిన చెత్తను కంపోస్టు షెడ్డుకు తరలిస్తున్నారు. తడి, పొడి చెత్తను వేరుచేసి ఎరువుగా తయారు చేయాలి. ముత్తారం, ధర్మారం గ్రామ పంచాయతీలు తడి చెత్తతో ఎరువు తయారీ చేసి ప్యాకెట్లలో విక్రయించారు. ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలనతో ఎరువుల తయారీపై దృష్టిసారించడం లేదు. ఎరువు విక్రయించిన సొమ్మును గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేయాలని కార్యదర్శులకు ఇటీవల ఆదేశాలు రావడంతో తడి, పొడిచెత్త వేరు చేసేందుకు గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డ్‌కు కాకుండా కంపోస్టు షెడ్డుకు తరలించాల్సి ఉంటుంది.

ఆధ్యాత్మికం

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



తిమ్మాపూర్: పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

తిమ్మాపూర్: మండలంలోని నేదునూర్ గ్రామంలో శ్రీరంగనాథస్వామి ఆలయ దశమ వార్షికోత్సవం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో కళకళలాడింది. విశేష పూజలు, హోమాలతో పాటు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేపట్టారు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా చేశారు. సమీప గ్రామాల నుంచి తరలివచ్చిన వందలాది భక్తులు కార్యక్రమంలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తి గీతాలు, మంత్రోచ్ఛరణలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఉత్సవంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఒంటెల శ్రీనివాస్ రెడ్డి, నారాయణరెడ్డి, రంగారెడ్డి, నరేందర్ రెడ్డి, మల్లారెడ్డి, రవీందర్ రెడ్డి, జగన్ రెడ్డి, చల్ల రమణా రెడ్డి, కాల్వ లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

బిందెలతో ఊరేగింపు

వీణవంక: మండలంలోని వల్భాపూర్ గ్రామంలో గౌడ కులస్తులు నీటిబిందెలతో ఊరేగింపుగా రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతీ ఇంటి నుంచి నీటిబిందెలతో డప్పుచప్పుళ్ల మధ్య ఆలయం వరకు చేరుకొని గీతకార్మికులు, గ్రామస్తులు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు.

వైభవంగా శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పూలమాలలతో అందంగా అలంకరించారు. ఎదుర్కోలు అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణ తిలకించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులకు ఇబ్బందులు కల్గకుండా సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కల్యాణం అనంతరం అన్నదానం చేపట్టారు. కల్యాణ వేడుకలను శేషం సత్యనారాయణాచార్యులు, మధుసూదనాచార్యులు, బన్నీ స్వామి, నర్సింహాచార్యులు, శ్రీనివాసాచార్యులు, సుధీరాచార్యులు, నవీనాచార్యులు ఆధ్వర్యంలో వేడుకలు జరగగా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు చొల్లేటి శంకరయ్య, దేవాదాయ ఇన్‌స్పెక్టర్ పాము సత్యనారాయణ, ఈఓ రాజ్‌కుమార్, డైరెక్టర్లు పూల లచ్చిరెడ్డి, గందె రాజయ్య, ఎనగందుల శారద, దుబాల శ్రీనివాస్, జీల సంపత్, బూర వీరేశం, ఆలయ కార్యనిర్వాహణాధికారి బూట్ల కవిత, పలువురు పాల్గొన్నారు.



చిగురుమామిడి: సుందరగిరిలో..



వీణవంక: ఊరేగింపుగా వెళ్తున్న గౌడ కులస్తులు

మానకొండూర్‌లో శకటోత్సవం

మానకొండూర్: మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి జాతరలో భాగంగా సోమవారం శకటోత్సవం నిర్వహించారు. భక్తులు ఎడ్ల బండ్లు, ఆటోలు, ట్రాక్టర్లతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. మానకొండూర్ గూడూరి వంశస్తులు జీవీ రామకృష్ణారావు అందజేసిన ఒడి బియ్యాన్ని ఆలయానికి చేర్చారు. శకటోత్సవాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట, గన్నేరువరం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని కరెంట్ వైర్ల కింద చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఆంజనేయులు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఖాసీంపేట, గన్నేరువరం, మైలారం, యాస్వాడ, చొక్కారావుపల్లె, చాకలివానిపల్లె, పారువెల్ల, దుబ్బపల్లె, సాంబయ్యపల్లె గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

హుజూరాబాద్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హరిప్రసాద్

హుజూరాబాద్: పట్టణ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొమురవెల్లి హరిప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పోటీలో పాల్గొన్న గోవర్ధన్, వెంపటి సతీశ్ తప్పుకోవడంతో ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు తెలిపారు. అలాగే ఉపాధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్టు మండల యాదగిరి, కోశాధికారిగా సీహెచ్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు ఏకగ్రీవమయ్యారు.

సీపీఐ గన్నేరువరం కార్యవర్గం

గన్నేరువరం: సీపీఐ గన్నేరువరం మండల నూతన కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నట్లు సోమవారం పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ప్రకటనలో తెలిపారు. 19 మందితో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. మండల కార్యదర్శిగా చొక్కాల శ్రీశైలం, సహాయ కార్యదర్శులుగా కూన మల్లయ్య, పిప్పల కనుకయ్య, కోశాధికారిగా కోతి సంపత్, కార్యవర్గసభ్యులుగా బోయిని మల్లయ్య, అందె రాజయ్య, గర్షకుర్తి శ్రీనివాస్, బోయిని తిరుపతి, చెరుకు ఆంజనేయులు, గాజుల లక్ష్మణ్, నాగయ్య, పరునంది బాబు, కౌన్సిల్ సభ్యులుగా ముల్కల పవన్, బొమ్మకంటి ఆంజనేయులు, మొలుగూరి ఆంజనేయులు, బుర్ర శ్రీను, తాళ్లపల్లి సంపత్, మడికె సంతోష్, దాసరి శ్రీను నియామకమయ్యారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నూతన అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా చొల్లేటి శంకరయ్య-పోతారాం-ఎస్), డైరెక్టర్లుగా పూల లచ్చిరెడ్డి-చిగురుమామిడి, గందె రాజయ్య-సుందరగిరి, జీల సంపత్‌యాదవ్-సుందరగిరి, ఎనగందుల శారదలక్ష్మణ్-సుందరగిరి, దుబాల శ్రీనివాస్, బూర వీరేశం నియామకమయ్యారు. ఈమేరకు దేవాదాయశాఖ అధికారులు ఆలయంలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఏడాదిపాటు పదవిలో కొనసాగుతారని తెలిపారు. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి బూట్ల కవిత, మాజీ సర్పంచ్ రమేశ్, చిటుమల్ల రవీందర్, ఇనుగాల శ్రీనివాస్‌రెడ్డి, ఒరుగంటి భారతీదేవి, కాటం సంపత్‌రెడ్డి, ఎండీ కుతుబుద్దీన్, ఎనగందుల లక్ష్మణ్, వంగర మల్లేశం, పోటు మల్లారెడ్డి, బోయిని వేణుగోపాల్ పాల్గొన్నారు. గతంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులుగా స్థానికులనే నియమించేవారు. కానీ ప్రస్తుతం స్థానికేతరులను భాగస్వామ్యం చేయడంతో స్థానికుల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి.





అవగాహన కల్పిస్తున్న సీఐ రవి, హుజూరాబాద్‌లో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

అసత్య ప్రచారాలు నమ్మొద్దు

జమ్మికుంట: మతాలకు అతీతతంగా దేశ రక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని టౌన్ సీఐ రవి అన్నారు. సోమవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అందరు కలిసి మెలిసి ఉండాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మొద్దని, తప్పుడు వార్తలు ప్రచారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

హుజూరాబాద్: మద్యం సేవించి వాహనాలు నడపొద్దని ఏఎస్ఐ కమల అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ, డ్రంకెన్ చేపట్టారు. వాహనాల పెండింగ్ చలాన్లు కట్టించారు. నెంబర్ ప్లేట్ అమర్చుకోవాలని పలువురిని హెచ్చరించారు. తనిఖీల్లో ఓదయ్య, అఖిల్, రాజశ్రీ, శిరీష పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



జెండా ఎగరవేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, నాయకులు

రామడుగు: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతి సీపీఐ కార్యకర్త సిద్ధం కావాలని, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పిలుపునిచ్చారు. మండలంలోని గోపాల్‌రావుపేటలో సోమవారం సీపీఐ జెండా ఎగరవేసిన అనంతరం రామడుగు మండల సీపీఐ మహాసభ కార్యక్రమంలో పాల్గొన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తున్నారని, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీల అమలు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మచ్చ రమేష్, గోడిశెల తిరుపతిగౌడ్, నాయకులు ఉమ్మెంతల రవీందర్‌రెడ్డి, ఎగుర్ల మల్లేశం, శంకరయ్య, లక్ష్మీ, నర్సయ్య, ఐలయ్య, రాజేష్, అజీమ్ పలువురు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన మంత్రి పొన్నం



వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుజూరాబాద్: మండలంలోని కందుగుల గ్రామానికి చెందిన మండ రాజేందర్‌గౌడ్ కుమారుడు సందీప్ వివాహానికి సోమవారం రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి వెంట పీసీసీ మెంబర్ పత్తి కృష్ణారెడ్డి, నాయకులు గూడురి స్వామిరెడ్డి, మండ అశోక్ తదితరులున్నారు.

ఘనంగా బుద్ధపూర్ణిమ



బుద్ధుడి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఏవైఎస్ సభ్యులు

చొప్పదండి: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏవైఎస్ ఆధ్వర్యంలో సోమవారం వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని బుద్ధ జయంతి నిర్వహించారు. గౌతమ బుద్ధుడి చిత్రపటానికి పూలమాలలు వేసి పంచశీల జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు కదారి గంగరాజు, పట్టణ అధ్యక్షుడు వడ్లూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పల్లకి సేవ

చొప్పదండి: పట్టణంలోని జ్ఞానసరస్వతి ఆలయంలో వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకి సేవా చేపట్టారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. మండలంలోని గుమ్లాపూర్ శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



పల్లకి సేవ నిర్వహిస్తున్న భక్తులు

కొండగట్టు గిరిప్రదక్షిణకు గోపాల్‌రావుపేట గ్రామస్తులు



గిరిప్రదక్షిణకు వెళ్తున్న భక్తులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన హనుమాన్ భక్తులు సోమవారం పౌర్ణమిని పురస్కరించుకొని కొండగట్టు గిరిప్రదక్షిణకు వెళ్లారు. గ్రామానికి చెందిన హనుమాన్ స్వాములు మహిళలు, భక్తులు గ్రామంలో ప్రత్యేకంగా భజనలు చేసి గిరిప్రదక్షిణకు బయలుదేరారు.

జవానులకు సంఘీభావంగా ర్యాలీ



హుజూరాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న హనుమాన్ మాలధారణ భక్తులు

హుజూరాబాద్: దేశ రక్షణకు ప్రాణాలు అర్పిస్తున్న జవానులకు సంఘీభావంగా సోమవారం పట్టణంలో ఆంజనేయ స్వాములు భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద అమర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి నినాదాలు చేశారు. పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి మాలధారణ భక్తులు మూడు రంగుల జెండాతో ర్యాలీ ప్రారంభించారు.ఈ ర్యాలీలో ఆంజనేయ స్వాములు భారీగా పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని శ్రీవిశ్వేశ్వరస్వామి ఆలయం(బొమ్మలగుడి)లో భారత త్రివిధ దళాల సైనికుల క్షేమార్థం కోసం అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆవుపాలు, కొబ్బరికాయలతో అర్చకులు వేణుగోపాల్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. ధర్మం, దేశ గౌరవ పోరాటమని, ఐక్యత, దేశభక్తి ప్రపంచానికి తెలియాలన్నారు. త్రివిధ దళాలకు స్వామివారి అనుగ్రహం కలగాలని వేడుకున్నమన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నపూర్ణ సేవా సమితి సభ్యులు, భవానీ భజన మండలి, భక్తులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితోనే గుర్తింపు



కేక్ కట్ చేస్తున్న సీఐ శ్రీలత, నర్సింగ్ సిబ్బంది

కరీంనగర్‌టౌన్: ప్రధాని అయినా.. ముఖ్యమంత్రి అయినా.. డెలివరీ అయ్యాక మొదటగా ఎత్తుకునేది నర్సులేనని, పైసల కోసం కాకుండా చిత్తశుద్ధితో ఉద్యోగం చేస్తేనే నర్సులకు గుర్తింపు ఉంటుందని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీలత అన్నారు. వరల్డ్ నర్సింగ్ డే సందర్భంగా సోమవారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్‌చేసి మాట్లాడారు. నర్సులు ఆరోగ్య వ్యవస్థకు మూలస్తంభాలని, వారి సేవలతోనే హాస్పిటల్‌కు గుర్తింపు వస్తుందన్నారు. అలాగే ఆడపిల్లలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రేమ పేరుతో లైఫ్‌ను రిస్క్‌లో పెట్టవద్దన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ప్రతిభ కనబరిచిన నర్సులకు అవార్డులు అందజేశారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు వినయ్, ఉపేందర్‌రెడ్డి, నాగరాజు, లోకేశ్, రాంచందర్, రాజీవ్‌రెడ్డి, తాహా, దిలీప్‌రెడ్డి, రవిమల్లారెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ లావణ్య, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్ పాల్గొన్నారు.

ప్రజల డిమాండ్ మేరకే అభివృద్ధి పనులు



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: ప్రజలు కోరిన మేరకే నగరంలోని వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం నగరంలోని 11వ డివిజన్ పరిధిలోని గౌతమినగర్‌లో సుడా నిధులు రూ.15 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సిరిసిల్ల బైపాస్ రోడ్డుకు సమీపంలో ఉన్న ఈ కాలనీ వర్షాకాలం వస్తే ముంపునకు గురవుతుంటుందని తెలిపారు. ఇళ్లల్లోని నీళ్ల చేరడం, రోడ్లు బురదతో ఉండి నడవడానికి కూడా కాలనీవాసులు ఇబ్బంది పడేవారని అన్నారు. అందుకే ఈ ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామని తెలిపారు. వర్షాకాలం వచ్చే లోపు వేగంగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆకుల నర్మద నర్సన్న, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు నెల్లి నరేశ్, పిట్టల లింగన్న, వడ్లకొండ సంపత్, చంద్రయ్య అంజయ్య, విజయ, మునమ్మ, డీఈ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై స్పష్టమైన విధానం ప్రకటించాలి

కరీంనగర్: రైతు రుణమాఫీ రూ.2 లక్షల అమలులో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలని కోరుతూ సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలుకు ప్రభుత్వం వేగవంతంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

గౌరవెల్లి ప్రాజెక్టు భూనిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

గౌరవెల్లి ప్రాజెక్టు భూనిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. అక్కన్నపేట మండలం, గుడాటిపల్లి గ్రామస్థులు పెట్టుకున్న అర్జీని సత్వరమే పరిష్కారించాలని అన్నారు.